

అన్నీ కాదు.. ఒక్కటే..!



19వ క్రస్ట్‌గేట్‌కు ఏర్పాటు చేస్తున్న స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ (ఫైల్)

కర్నూలు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల జీవనాధారమైన తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లలో అంతులేని జాప్యం జరుగుతోంది. గతేడాది ఆగస్టులో 19వ నంబరు క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయింది. సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు డ్యాం వద్దే మకాంవేసి స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు చేశారు. రెండు రాష్ట్రాల రైతుల కన్నీళ్లు తుడిచారు. డ్యాంను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ మొత్తం 33 గేట్లు మార్చాలని, వాటి స్థానంలో అత్యాధునిక డిజైన్‌తో నూతన గేట్లు ఏర్పాటు చేయాలని, అంతకుమందు క్రస్ట్‌గేట్ల నిపుణులతో అధ్యయనం చేయించాలని సూచించింది. నెలలు గడిచినా ఒక్క గేటు మాత్రమే ఏర్పాటు చేస్తారా..? మొత్తం అన్ని గేట్లు మారుస్తారా..? అన్న విషయంపై తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈ అంశాలను ఆంధ్రజ్యోతి పలు కథనాలు ద్వారా వెలుగులోకి తెచ్చింది. ఫిబ్రవరి 22న 'గేటా.. గేట్లా..?!' శీర్షికన అధికారులు, పాలకుల నిర్లక్ష్యంపై వెలుగులోకి తెచ్చింది. ఎట్టకేలకు కొట్టుకుపోయిన 19వ నంబరు గేటు మాత్రమే మార్చాలని టీబీపీ బోర్డు ఇంజనీర్లు నిర్ణయం తీసుకున్నారు. దాదాపు రూ.2 కోట్లతో టెండర్లు పిలిచారు. జూన్ ఆఖరులోగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ తొలగించి నూతన క్రస్ట్‌గేటు ఏర్పాటు చేస్తామని తుంగభద్ర బోర్డు ఎస్ఈ (ఎఫ్ఏసీ) నారాయణనాయక్ ఆంధ్రజ్యోతికి వివరించారు.

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర జలాశయం. కరువు, వలసలతో తల్లడిల్లే రాయలసీమ ప్రాంతం కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ప్రాణాధారం ఈ ప్రాజెక్టు. కర్నూలు జిల్లాలో టీబీపీ ఎల్లెల్సీ కాలువకు డ్యాం నుంచి 24 టీఎంసీలు వాటా ఉంది. ఖరీఫ్, రబీ సీజన్‌లో 1.51 లక్షల ఎకరాలకు సాగునీరు, 195 గ్రామాలకు తాగునీరు అందించే ప్రధాన నీటివనరు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీబీపీ హెచ్చెల్సీ కాలువకు 32.50 టీఎంసీలు నీటి వాటా ఉంది. 2.85 లక్షల ఎకరాకలు సాగునీరు అందించాల్సి ఉంది. కేసీ కాలువకు 10 టీఎంసీలు నీటివాటా ఉంది. కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు ఇవ్వాల్సి ఉంది. 1953 నుంచి రెండు రాష్ట్రాల నీటి ప్రయోజనాలు కాపాడుతున్న తుంగభద్ర డ్యాం 19వ నంబరు క్రస్ట్‌గేట్ గత ఏడాది ఆగస్టులో వరద ఉధృతికి కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని.. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడును డ్యాంకు పంపించారు. టీబీపీ బోర్డు, కర్ణాటక, ఏపీ ఇంజనీర్లను సమన్వయం చేసుకుంటూ కన్నయ్యనాయుడు పది రోజులకు పైగా శ్రమించి ఎట్టకేలకు 'స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్' ఏర్పాటు చేశారు. వరద కడలిపాలు కాకుండా కాపాడగలిగారు. తరువాత కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ క్షేత్రస్థాయిలో డ్యాంను, గేట్లను పరిశీలించారు. గేట్ల జీవిత కాలం తీరిపోయింది. మరమ్మతులతో కాలయాపన చేయకుండా మొత్తం 33 గేట్లు మార్చాలంటూ పలు సూచనలతో అదే ఏడాది సెప్టెంబరులో నివేదిక ఇచ్చింది. అయితే గేట్ల సామర్థ్యంపై క్రస్ట్‌గేట్ల నిపుణులతో అధ్యయనం చేయించాలని సూచన చేశారు. ఆ నివేదిక ఆధారంగా డిసెంబరు ఆఖరులోగా డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) తయారు చేయించాలని నవంబరులో జరిగిన టీబీపీ బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. నెలలు గడిచిపోతున్నా గేట్లు మార్చడంపై నిర్ణయం తీసుకోకుండా టీబీపీ బోర్డు అధికారులు జాప్యం చేస్తూ వస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.



గత ఏడాది 13న తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో వృథాగా పోతున్న వరద (ఫైల్)

- తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్‌గేట్ ఏర్పాటుకు టెండర్లు పిలిచిన టీబీపీ బోర్డు
- మొత్తం 33 గేట్లు మార్చాలని ఏకే బజాజ్ కమిటీ సూచనలు
- అధ్యయనం పేరిట కాలయాపన
- డ్యాం క్రస్ట్ గేట్ల సామర్థ్యంపై కేఎస్ఎన్‌డీటీ సంస్థ సర్వే
- మూడు రోజుల్లో నివేదిక ఇచ్చే అవకాశం

19వ గేటు ఏర్పాటుకు టెండర్లు

సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ కమిటీ మొత్తం 33 గేట్లు మార్చాలని, అందులో 11 గేట్లు అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్నాయని, వాటిని తక్షణమే మార్చాలని సూచించారు. మొత్తం గేట్లు కాకుండా ఈ ఏడాది కేవలం కొట్టుకుపోయిన 19వ నంబరు గేటుకు ఏర్పాటు చేసిన స్టాప్‌లాగ్ తొలగించి, ఆ స్థానంలో నూతన గేటు ఏర్పాటుకు దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు హెచ్‌డబ్ల్యూ అండ్ హెచ్చెల్సీ డివిజన్ ఇంజనీర్లు ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలిచారు. ఈ నెల 11న ఆన్‌లైన్ టెండరు షెడ్యూల్ దాఖలుకు గడువు ఇచ్చారు. ఆ తర్వాత టెక్నికల్, ప్రైజ్ బిడ్‌లో ఓపన్ చేసి, అర్హత సాధించిన కాంట్రాక్ట్ సంస్థతో ఒప్పందం చేసుకొని మే నెలలో పనులు మొదలు పెడతామని ఇంజనీర్లు తెలిపారు. రెండు నెలల గడువులోగా అంటే జూన్ ఆఖరులోగా కొత్త గేటు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే జూన్ ఆరంభంలో రుతుపవనాలు వచ్చి వర్షాలు కురిసి డ్యాంకు వరద పోటెత్తితే గేట్ ఏర్పాటు కష్టంగా మారుతుంది. ఆగస్టులో గేటు కొట్టుకు పోయింది. సెప్టెంబరులోనే నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చింది. ఆ వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి టెండర్లు పిలిచి పనులు చేపట్టి ఉంటే ఏప్రిల్ ఆఖరులోగా నూతన గేటు ఏర్పాటు చేసే అవకాశం ఉండేది.

మిగతా 6వ పేజీలో

ఏకకాలంలో దాడులు

- రియల్టర్ ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో సోదాలు
- ఐదు బృందాలుగా విడిపోయిన పోలీసులు
- బెంగుళూరు వాసి ఫిర్యాదుతో దాడులు
- పలు రికార్డులు స్వాధీనం



తనిఖీలు చేస్తున్న పోలీసులు

నంద్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణానికి చెందిన ఓ రియల్టర్, అతడి సోదరుడితో పాటు మరో ఇద్దరికి(కుటుంబ సభ్యులు) చెందిన ఇళ్లు, వ్యాపార సముదాయాలపై బుధవారం పోలీసులు ఏకకాలంలో దాడుల చేశారు. ముందస్తుగానే పోలీసులు ఐదు బృందాలుగా విడిపోయి ఒకేసారి ఐదుచోట్ల మెరుపు దాడులు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్, కాటన్ వ్యాపారి బొగ్గారపు నాగరాజు, బెంగుళూరుకు చెందిన మరొక రియల్ వ్యాపారి ఇట్టిన మను ఇద్దరు కలిసి రియల్ ఎస్టేట్‌తో పాటు పలు రకాల వ్యాపారాలు చేశారు. కొన్నేళ్లుగా ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఒకరికి ఒకరు దూరంగా ఉన్నారు. అయితే వారు కలిసి చేసిన రియల్‌ఎస్టేట్ తదితర వ్యాపార వ్యవహారాలకు సంబంధించి ఆర్థిక లావాదేవీల సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల బొగ్గారపు నాగరాజు.. ఫేక్ డాక్యుమెంట్స్, ఫోర్జరీ సంతకాలు చేసి రూ. కోట్లలో అప్పులు సదరు రియల్టర్ మను ఇవ్వాల్సి ఉందని కోర్టుకు వెళ్లారు. కోర్టు నుంచి నోటీసులు రావడంతో మరో మను 20 రోజుల కిందట బొగ్గారపు నాగరాజు, అతని సోదరుడు బొగ్గారపు నాగప్రసాద్‌తో పాటు వారి కుటుంబ సభ్యులైన మరో ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. కోర్టు వారెంట్‌తో కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అదేశాలకు మేరకు.. గురువారం నగరంలోని 1,2,3 టౌన్ పోలీసు స్టేషన్‌తో పాటు రూరల్ పోలీసులు కలిసి ఐదు బృందాలుగా విడిపోయి ఆయా ఇళ్లతో పాటు వారికి చెందిన వ్యాపార సంస్థలపై ఆకస్మికంగా మెరుపుదాడులు చేశారు.

ఐదు చోట్ల.. ఐదు బృందాలు..

నగరంలోని సీఐలు సుధాకర్‌రెడ్డి, ఇస్మాయిల్, కంబగిరి రాముడు, శ్రీనివాసరెడ్డి కలిసి ఐదు బృందాలుగా ఏర్పడి నగరంలోని బాలాజీ కాంప్లెక్స్, శ్రీనివాస్‌నగర్‌లోని ఇళ్లతో పాటు ఓ అపార్ట్‌మెంట్, లలిత కాటన్ మిల్, ఐశ్వర్య కాటన్ మిల్, సౌందర్య కాటన్ మిల్ దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో వీరందరూ కూడా స్థానికంగా లేకపోవడం, ఇళ్లకు తాళం వేసి ఉండటంతో కోర్టు అదేశాలు మేరకు తాళాలు పగలకొట్టి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

మిగతా 6వ పేజీలో

గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలి



సిలిండర్‌తో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల రూరల్ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండు చేశా రు. గురువారం స్థానిక సంజీవనగర్‌లో సిలిండర్‌లో ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్యాస్‌పై రూ.50, పెట్రోల్‌పై రూ.2 పెంచి పేదలపై భారం మోపడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు, శ్రీనివాసులు, మహిళా సమాఖ్య కన్వీనర్ సుశీలమ్మ పాల్గొన్నారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

20న ఈస్టర్ పండుగ నేపథ్యంలో తేదీ మార్పు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని 20 మోడల్ పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి ప్రవేశం కోసం ఈ నెల 20వ తేదీ నిర్వహించాల్సిన పరీక్షను 21వ తేదీకి మార్చినట్లు డీఈవో జ నార్దన్‌రెడ్డి తెలిపారు. డీఈవో మాట్లాడుతూ 20న ఈస్టర్ పండుగ ఉండ డంతో ప్రవేశ పరీక్షను 21వతేదీకి మార్చినట్లు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొత్త విధానంలో వృత్తి పన్ను రిజిస్ట్రేషన్

నంద్యాల మున్సిపాలిటీ ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వృత్తి పన్ను రిజిస్ట్రేషన్‌ను పారదర్శకంగా నిర్వహించేందుకు నూతన విధానాన్ని ప్రవేశపెట్టినట్లు వాణిజ్య పన్నుల శాఖ నంద్యాల సహాయ కమిషనర్ లక్ష్మీనాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏప్రిల్ 1 నుంచి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్, రిటర్న్ దాఖలు చేయటానికి పన్ను చెల్లింపుదారుల కోసం నూతన మాడ్యుల్‌ను సిద్ధం చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.10 లక్షల కంటే అధిక వార్షిక టర్నోవర్ ఉన్న జీఎస్టీ పన్ను చెల్లింపు దారులు వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వాణిజ్య పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు నెలకు రూ.15 వేల కంటే ఎక్కువ జీతం చెల్లిస్తున్న యజమానులు, ఉద్యోగుల తరఫున ప్రభుత్వానికి వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పన్ను చెల్లింపుదారులు వాణిజ్య పన్నుల శాఖ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎపిసిటి.జిఓవి.ఇన్ ద్వారా చెల్లింపులు చేయవచ్చని తెలిపారు.



మాట్లాడుతున్న సహాయ కమిషనర్ లక్ష్మీనాయక్

రైతులకు మెరుగైన సౌకర్యాలు అందించాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా సహకార సమన్వయ అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు 51 సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తయిందన్నారు. మిగతావి కూడా వారం రోజుల్లో పూర్తి కావాలన్నారు. రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు సహకార, కో ఆపరేటివ్ బ్యాంక్ అధికారులు సహకరించాలని ఆదేశించారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులు భద్రపరచుకోవడానికి బస్తాకు రూ.4చొప్పున రుసుం చెల్లించేలా నిర్ణయించినమేరకు చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో రైతులకు మేలుతో పాటు సహకార సంఘాలు కూడా లాభాల బాటలో పయనిస్తాయన్నారు. డ్రోన్ల కొనుగోలుకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమా వేశంలో జిల్లా సహ కార శాఖ అధికారి వెంకట సుబ్బయ్య, నాబార్డు అధికారి సుబ్బారెడ్డి, డీపీఓ షేక్ జమీవుల్లా, మత్స్యశాఖ అధికారి రాఘవ రెడ్డి, పశుసంవర్ధకశాఖ అధికారి గోవిందునాయక్ పాల్గొన్నారు.

16న జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు ఈ నెల 16న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి గురువారం తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశభవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11 గంటల నుంచి 12 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 12 గంటల నుంచి ఒంటి గంట వరకు 6వ స్థాయి సంఘం సమావేశాలు జరుగుతాయి. అదేవిధంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు 4వస్థాయి సంఘం, 2:30 గంటల నుంచి 3:30 వరకు 5వ స్థాయి సంఘం, 3:30 నుంచి 5:30 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహిస్తామని సీఈవో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

బోగస్ హాజరుతో నిధులు నొక్కేశారు..!

కర్నూలు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజనల్ హాస్టళ్ల పేరిట జరుగుతున్న దోపిడీ వాస్తవమే. పేద విద్యార్థుల కడుపులు కొడుతున్నారు. విద్యార్థులు హాజరు కాకపోయినా బోగస్ హాజరు చూపించి నిధులు స్వాహా చేస్తున్నారు. ఈ భాగోతాన్ని ఆంధ్రజ్యోతి ఫిబ్రవరి నెలలో వెలుగులోకి తెచ్చింది. ఏపీ లోకాయుక్త సుమోటోగా కేసు నమోదు చేసింది. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాల మేరకు జిల్లా విద్యా అధికారి శ్యాముల్ పాల్, సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఏపీసీ శ్రీనివాసుల పర్యవేక్షణలో ఎంఈఓల నేతృత్వంలో మండల కమిటీలు వేసి విచారణ చేశారు. సీజనల్ హాస్టల్ నిర్వాహకులైన స్వచ్ఛంద సంస్థలు బోగస్ హాజరు చూపడమే కాకుండా హాజరైన విద్యార్థులకు సైతం మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు వడ్డించడం లేదని విచారణ అధికారులు నివేదికలు ఇచ్చారు. ఆ నివేదికల ఆధారంగా ఏడు స్వచ్ఛంద సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టినట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ శ్రీనివాసులు తెలిపారు.



సీజనల్ హాస్టల్‌లో విచారణ చేస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ శ్రీనివాసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- వలసల నివారణకు సీజన్ హాస్టళ్లు
- ఒక్కో కేంద్రానికి నెలకు రూ.80 వేలు ఇస్తున్న ప్రభుత్వం
- బోగస్ హాజరుతో నిధులు స్వాహా చేసిన నిర్వహణ స్వచ్ఛంద సంస్థలు
- ఫిబ్రవరిలో వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి
- సుమోటోగా లోకాయుక్త కేసు నమోదు
- బ్లాక్ లిస్టులో ఏడు స్వచ్ఛంద సంస్థలు!

మిగతా 6వ పేజీలో

పురాతన బావిలో పూడికతీత



పూడిక బయటికి లాగడానికి ఏర్పాటు చేసుకున్న యంత్రం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఊరందురూ ఆధారపడిన ఈ పురాతన బావి కాలక్రమేణ శిథిలావస్థకు చేరుకొని పూడిపోయింది. అయితే ఇటీవల గ్రామంలో తాగు నీటి కొరత ఏర్పడింది. దీంతో గ్రామస్థులు పూడికతీత పనులు మొదలుపెట్టారు. కొలిమిగుండ్ల మండలంలోని నందిపాడు గ్రామంలోని చౌడేశ్వరి ఆలయం ముందున్న పురాతన బావిలో నాలుగు రోజులుగా గ్రామస్థులు పూడికతీత పనులు చేపడుతున్నారు. బావి బయట ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేసి పూడికను తోడుతున్నారు. దీంతో మట్టిలో కూరుకపోయిన అద్భుతమైన పురాతన బావి కట్టడం బయటపడింది.

బయటపడ్డ శిలాశాసనం: బావి పూడికతీత పనుల్లో ఓ బండ రాయిపై రాసి ఉన్న శిలాశాసనం బయట పడింది. సంస్కృతంలో రాసి ఉన్న శిలాశాసనం చౌడేశ్వరీ ఆలయ చరిత్రను తెలిపేదని స్థానికులు పేర్కొంటున్నారు. పురావస్తు అధికారులు ఈ రాతను వివరించాలని కోరుతున్నారు.



బావిలో పూడికతీత పనులు చేస్తున్న గ్రామస్థులు

- నీటి ఎద్దడి నివారణ కోసం గ్రామస్థుల యత్నం
- బావిలో నుండి బయటపడ్డ శిలా శాసనం



బయట పడిన శిలా శాసనం

వన్య ప్రాణుల కోసం..

రుద్రవరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలోని రుద్రవరం రేంజ్‌లో సోలార్ విద్యుత్‌తో నీటి గుంతలకు నీరు సరఫరా చేస్తున్నారు. వేసవిలో వన్యప్రాణుల దాహం తీర్చడానికి అటవీశాఖ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసింది. అట్లాగే పీటీ, ఎంపీటీ ట్యాంకులను ఏర్పాటు చేసింది. వన్యప్రాణులకు దాహం తీరడంతోపాటు నీటి గుంతల చుట్టూ చెట్లు పచ్చబడతాయి. చెట్ల కింద గడ్డి పెరుగుతుంది. వన్యప్రాణులకు ఆకలి తీర్చేందుకు ఈ గడ్డి ఉపయోగపడుతుంది. వన్యప్రాణులు నీరు తాగడంతోపాటు శరీరాన్ని చల్లబరుచుకుంటాయి. పక్షులు కూడా దాహం తీర్చుకుంటున్నాయి.

సోలార్ ప్యానల్ ఏర్పాటు ఇలా

రుద్రవరం రేంజ్‌లో అహోబిలం, బీవీపెంట, న్నూతల, ఆలమూరు సెక్షన్ల పరిధిలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. చెలిమ రేంజ్‌లో రెండు ఏర్పాటు చేశారు. అట్లాగే రుద్రవరం రేంజ్‌లో సాసర్‌పీట్లు 29, చెలిమ రేంజ్‌లో 28 ఉన్నాయి. వీటికి ట్యాంకర్లతో నీరు సరఫరా చేసి నింపేవారు. ఈ సాసర్‌పీట్లలో నీరు సరిపోకపోవడంతో గుంతలు ఏర్పాటు చేశారు.



నల్లమలలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్

రుద్రవరం రేంజ్‌లో ఐదు చోట్ల సోలార్ ప్యానల్స్

రుద్రవరం రేంజ్‌లో అహోబిలం, న్నూతల, బీవీ పెంట, ఆలమూరు సెక్షన్లలో సోలార్ ప్యానల్స్ ఐదు చోట్ల ఏర్పాటు చేశాం. వీటిలో ఐసీఐసీ, ఫారెస్టుశాఖ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేసి వన్యప్రాణుల దాహం తీర్చుతున్నాం.

-శ్రీపతినాయుడు, రేంజర్, రుద్రవరం రేంజ్

చెలిమ రేంజ్‌లో రెండు చోట్ల..

చెలిమరేంజ్‌లో రెండు చోట్ల నీటి గుంతలకు సోలార్ విద్యుత్‌తో నీరు సరఫరా చేస్తున్నాం. ఈ రేంజ్‌లో 28 సాసర్ పీట్లు ఉన్నాయి.

-ఉదయదీప్, ఇన్‌ఛార్జ్ రేంజర్, చెలిమ

- సోలార్ ప్యానల్‌తో గుంతలకు నీరు పంపింగ్
- నల్లమలలో దాహం తీర్చుకుంటున్న అడవి జంతువులు



నల్లమలలో నీటిగుంత వద్ద జింకలు



అడవిలో ఏర్పాటు చేసిన నీటి గుంతలు



బోరు నుంచి ఉబికి వస్తున్ననీరు

అన్నీ కాదు..ఒక్కటే..!



స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు తర్వాత పూర్తిగా ఆగిపోయిన నీటి ప్రవాహం (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

బోర్డు ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా వరద వచ్చే సమయానికి హడావుడిగా గేట్లు ఏర్పాటుకు సన్నాహాలు చేయడం విమర్శలకు తావిస్తోంది. జూన్ ఆఖరు వరకు గడువు ఇవ్వకుండా మే ఆఖరులోగా ఏర్పాటు చేస్తే.. జూన్‌లో వర్షాలు కురిసి వరద వచ్చినా ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఆ దిశగా బోర్డు ఇంజనీర్లు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

మూడు రోజుల్లో నివేదిక

నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నియమించిన సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ సూచన మేరకు మొత్తం 33 క్రస్టుగేట్ల సామర్థ్యంలో టీబీపీ బోర్డు అధికారులు అధ్యయనం చేయించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చీరాల కేంద్రంగా పని చేస్తున్న కేఎస్ఎన్‌డీటీ సంస్థ క్రస్టుగేట్ల నిపుణులు బృందం దాదాపు 20 రోజులు మొత్తం గేట్లను క్షుణంగా తనిఖీ చేశారు. డ్యాం నిర్మాణం సమయంలో క్రస్టుగేట్ల డిజైన్ మేరకు తయారి సమయంలో పొడవు, వెడల్పు, మందం, బరువు ఉండేది..? ఆ తరువాత గేట్లలో వచ్చిన మార్పులు, వరద ఒత్తిడికి గేట్లు మందం ఏమైనా తగ్గిందా..? ఇలా పలు సాంకేతిక కోణాల్లో క్రస్టుగేట్స్ హెల్త్ చెకప్ చేశారు. రెండు, మూడు రోజుల్లో బోర్డుకు నివేదిక ఇచ్చే అవకాశం ఉంది. ఆ నివేదిక రాగానే ఏపీ ప్రభుత్వం జలవనరులు సలహాదారుడు, క్రస్టుగేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడుతో చర్చించి మొత్తం గేట్ల ఏర్పాటుపై ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలకు నివేదిక పంపేందుకు బోర్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

డ్యాం 19వ గేటు ఏర్పాటు చేస్తున్నాం

గత ఏడాది ఆగస్టులో కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ గేటుకు ఏర్పాటు చేసిన స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ తొలగించి, ఆ స్థానంలో నూతన గేటు ఏర్పాటుకు దాదాపు రూ.2 కోట్లతో టెండర్లు పిలిచాం. జూన్ ఆఖరుగాలో గేటు ఏర్పాటు చేస్తాం. గేట్ల పరిస్థితి, సామర్థ్యాన్ని పరిశీలించిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ నివేదిక ఇవ్వగానే క్రస్టుగేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడుతో చర్చించి మొత్తం గేట్ల ఏర్పాటుపై బోర్డు నిర్ణయం తీసుకుంటుంది.

- నారాయణనాయక్, తుంగభద్ర బోర్డు ఎస్ఈ (ఎఫ్ఏసీ), హోస్పేట్

ఏకకాలంలో దాడులు



లలిత కాటన్ మిల్‌లో తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

అదేవిధంగా మరో ఇంటికి వెళ్తే.. ఆ ఇంటిని ఇతరులకు అద్దెకు ఇచ్చినట్లు తెలిసింది. మిగిలిన కాటన్ మిల్లులో అక్కడ ఉన్న సిబ్బంది నేతృత్వంలో పోలీసులు ముమ్మర తనిఖీ చేసి పలు డాక్యుమెంట్లు, బ్యాంకు అకౌంట్‌కు చెందిన పుస్తకాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు పది గంటల పాటు పోలీసులు తనిఖీలు చేశారు. ఇదిలా ఉండగా బొగ్గారపు నాగరాజు, నాగప్రసాద్ మరో ఇద్దరు కూడా పథకం ప్రకారమే 15 రోజుల క్రితం నంద్యాల నుంచి వెళ్లినట్లు సమాచారం. ఇతర ప్రాంతాల్లో ఉంటూ ఇక్కడి వ్యవహారాలపై గుట్టుగా తెలుసుకుని తమ వ్యాపార లావాదేవీలు చూసుకుంటున్నట్లు తెలిసింది.

ఆర్థిక లావాదేవీల్లో విభేదాలు

బొగ్గారపు నాగరాజు, మను కలిసి 2010 నుంచి రియల్ ఎస్టేట్ రంగంతో పాటు ఇతరత్రా వ్యాపారాలు చేశారు. వీరిద్దరి మధ్య వందల రూ.కోట్లలో లావాదేవీలు జరిగాయి. రెండేళ్లుగా ఇరువురి మధ్య పలు రకాలుగా విభేదాలు రావడం.. ఆ తర్వాత ఫోర్జరీ, నకిలీ డాక్యుమెంట్లతో నాగరాజు కోర్టుకు వెళ్లడంతో విభేదాలు తార స్థాయికి చేరాయి. తనకు బెంగుళూరు చెందిన మను రూ.కోట్లలో అప్పు ఉన్నట్లు నాగరాజు కోర్టుకెళ్లారు. మరో వ్యాపారి మను వెంటనే అప్రమత్తమై కోర్టుకు వెళ్లి ఆ తర్వాత నంద్యాల త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉండగా ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కీలక రాజకీయ నాయకులతో పరిచయం, అండదండలు ఉన్నాయి. అందుకే పోలీసులు కూడా ఆచితూచి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

రేపటి నుంచి ఫోరెన్సిక్ వైద్యుల సదస్సు

హాజరు కానున్న 380 మంది



బ్రోచర్లను విడుదల చేస్తున్న ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌వోడీ డా. సాయిసుధీర్, వైద్యులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 6వ రాష్ట్ర ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యుల సదస్సు ఈ నెల 12, 13 తేదీల్లో కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో నిర్వహిస్తున్నట్లు ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌వోడీ, ఆర్గనైజింగ్ చైర్మన్ డా.టి. సాయిసుధీర్ వెల్లడించారు. గురువారం కర్నూలు మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ విభాగంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలులో మొట్టమొదటిసారిగా ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు నుంచి 380 మంది వైద్యులు హాజరవుతున్నారని తెలిపారు. ముఖ్య అతిథులుగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. నరసింహులు, డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ బిందుమాధవ్, ప్రిన్సిపాల్ డా. చిట్టినరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు హాజరవుతున్నారని అన్నారు. ఈ సదస్సు థీమ్ క్లీనికల్ ఫోరెన్సిక్ మెడిసిన్ ఎక్స్‌పర్ట్‌గా నిర్ణయించామని తెలిపారు. అనంతరం రాష్ట్ర సదస్సు బ్రోచర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.పి. బ్రహ్మాజీ మాస్టర్, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీ, కోశాధికారి డా.వైకేసీ రంగయ్య, సభ్యులు డా.కే. నాగార్జున, డా.వీ. కోటేశ్వరరావు, డా.పి. హరీష్ కుమార్, డా.వీ. సురేఖ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లించాలి: ఏపీటీఎఫ్

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి వెంటనే పారితోషికాలు చెల్లించాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి కోరారు. గురువారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రూ.35 కోట్లు త్వరలో విడుదల చేస్తామని వారికి ఆయన హామీ ఇచ్చారు.

ఎన్‌ఈపీ అమలుకు స్టేట్ టాస్క్‌ఫోర్స్

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో జాతీయ విద్యా విధానం అమలుకు పాఠశాల విద్యాశాఖ స్టేట్ టాస్క్‌ఫోర్స్‌ను నియమించింది. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ చైర్మన్‌గా ఉన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఆ శాఖ కమిషనర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో ఎన్‌ఈపీ అమలు ఎంతవరకు వచ్చింది? మొత్తం విధానం అమలుచేసేందుకు ఇంకా చేపట్టాల్సిన చర్యలపై ఈ కమిటీ కసరత్తు చేస్తుంది.

14న హెచ్‌డీఎస్ సమావేశం

- 19న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ రాక
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి సొసైటీ(హెచ్‌డీఎస్) సమావేశాన్ని ఈనెల 14వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ సమావేశాన్ని 14వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటలకు ధన్వంతరీ హాలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం తన చాంబర్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.శ్రీరాములు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, ఏడీ మహేశ్వరమ్మతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగే హెచ్‌డీఎస్ సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గౌరు చరితారెడ్డి హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సమస్యలు, రోగుల ఇబ్బందులు పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 19వ తేదీ శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పూర్తి స్థాయి స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదే రోజు కర్నూలు జీజీహెచ్‌ను ఆయన పరిశీలిస్తారని తెలిపారు.



హెచ్‌డీఎస్ నూతన కమిటీ

కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్‌డీఎస్)కు 16 మంది సభ్యులతో కమిటీ చైర్మన్ కలెక్టర్ పి.రంజిత్ బాషా ఏర్పాటు చేశారు. కమిటీలో కో చైర్మన్‌గా మంత్రి టీజీ భరత్, కన్వీనర్‌గా సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, సభ్యులుగా పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు బి.దస్తగిరి, గౌరు చరితారెడ్డి, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, డీఎంఈ డీవీఎస్ఎల్ నరసింహం, బి.పద్మజ, ఏహెచ్ ప్రవీణ్ కుమార్, పి.రంగనాథరెడ్డి, బి.రామాంజనేయుల (ఆర్.కొంతలపాడు), వీటీ సాయిప్రదీప్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, కేఎంసీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ, ఏపీఎంఎస్ఐడీసీ డీఈ కరీముల్లా, డీసీహెచ్ఎస్ కే.శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ పి.శాంతికళ ఉంటారు.

బోగస్ హాజరుతో నిధులు నొక్కేశారు..!

(5వ పేజీ తరువాయి)

కర్నూలుకు పశ్చిమ ప్రాంతం అంటేనే గుర్తుకొచ్చేది కరువు, వలసలు. ఇక్కడి ప్రాంతాల్లో తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు సైతం గుంటూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. దీంతో చిన్నారుల చదువులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. విద్యార్థుల వలసలు నివారించాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మంత్రాలయం, ఆలూరు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో 34 సీజనల్ హాస్టళ్లు (కాలానుగుణ వసతి కేంద్రాలు) ఏర్పాటు చేశారు. నిర్వహణ బాధ్యతలు స్వచ్ఛంద సంస్థలు, గ్రామాల్లోని స్వయం సహాయక మహిళా పొదుపు సంఘాలకు అప్పగించారు. ప్రతి హాస్టల్‌లో 50 మంది విద్యార్థులకు భోజన వసతి కల్పించాలి. మధ్యాహ్న భోజనం పాఠశాలలో తింటే.. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం, సెలవు రోజుల్లో మధ్యాహ్నం కూడా భోజనం వడ్డించాలి. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.వెయ్యి, కేర్ టేకర్, ట్యూటర్, ఇద్దరు వంట మనుషులు రూ.30 వేలు జీతం చొప్పున ఒక్కో సీజనల్ హాస్టల్‌కు రూ.80 వేలు నిధులు ఇస్తుంది. 34 సీజనల్ హాస్టళ్లకు నెలకు రూ.27.20 లక్షలు ఖర్చు చేస్తోంది.

ఆంధ్రజ్యోతి తనిఖీలో వెలుగులోకి..

సీజనల్ హాస్టళ్లను నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా..? మెనూ ప్రకారం భోజనాలు వడ్డిస్తున్నారా..? విద్యార్థుల సేవలో ఏమేరకు తరిస్తున్నాయి..? సీజనల్ హాస్టళ్లను ఫిబ్రవరి 23న ఆంధ్రజ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేస్తే అత్యంత దారుణమైన నిజాలు వెలుగు చూశాయి. మెజార్టీ హాస్టళ్లలో సగం కంటే తక్కువ విద్యార్థులే ఉన్నారు. వారికైనా రుచికరమైన భోజనం వడ్డించారా..? అంటే అదీలేదు. నీళ్ల చారు, ఉడికీఉడకని ముద్దన్నంతో సరిపుచ్చారు. కేర్ టేకర్, ట్యూటర్లు అందుబాటులో లేరు. సగం మంది విద్యార్థులు కూడా హాజరు కాకపోయినా 95 శాతం హాజరైనట్లు రికార్డులు చూపి నిధులు స్వాహా చేస్తున్నట్లు వెలుగు చూసింది. ఆంధ్రజ్యోతి కథనాన్ని సుమోటోగా తీసుకొని ఏపీ లోకాయుక్త కేసు నమోదు చేసింది. విచారణ చేసి నివేదిక ఇవ్వాలంటూ ఎస్ఎస్ఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

బ్లాక్ లిస్టులో ఏడు స్వచ్ఛంద సంస్థలు

క్షేత్రస్థాయిలో విచారించిన మండల విద్యాశాఖ అధికారులు, ప్రత్యేక అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా సీజన్ హాస్టళ్లు నిర్వహిస్తున్న ఏడు స్వచ్ఛంద సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టినట్లు ఏపీ సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) అడిషినల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

- కోసిగి జడ్పీ హైస్కూల్ (బాలికలు)-1 (రూరల్ యాక్టివిటీ డెవలప్‌మెంట్ సంస్థ)
- కోసిగి జడ్పీ హైస్కూల్ (బాలికలు)-2 (రూరల్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ)
- పత్తికొండ మండలం పందికోన ఎంపీపీఎస్-1 (సుకన్య విలేజ్ ఆర్గనైజింగ్)
- పత్తికొండ మండలం పందికోన-2 ఎంపీపీఎస్ (సుకన్య విలేజ్ ఆర్గనైజింగ్)
- ఆదోని మండలం పెద్దహరివాణం జడ్పీ హైస్కూల్ (శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వచ్ఛంద సంస్థ)
- ఆదోని మండలం పెద్దహరివాణం జడ్పీ హైస్కూల్ (గజలింగేశ్వర స్వచ్ఛంద సంస్థ)
- క్రిష్ణగిరి మండలం కంబలపాడు జడ్పీ హైస్కూల్ (శారద పొదుపు సంఘం)

అదేవిధంగా పత్తికొండ మండలం దూదేకొండ ఎంపీపీ స్కూల్ సీజన్ హాస్టల్ నిర్వహిస్తున్న సంధ్య స్వచ్ఛంద సంస్థ, జూటూరు ఎంపీపీ స్కూల్ సంజీవకుమార్ స్వచ్ఛంద సంస్థ, తుగ్గలి మండలం జి.ఎర్రగుడి ఎంపీపీ స్కూల్ సీజనల్ హాస్టల్ నిర్వహించే మారుతి సంస్థలకు ఇచ్చే నిధుల్లో 20 శాతం కోత పెట్టారు. మంత్రాలయం మండలం రచ్చుమర్రి ఎంపీపీ స్కూల్‌లో సీజనల్ హాస్టల్ నిర్వహణ షర్మిల పొదుపు సంఘం, మాధవరం ఎంపీపీ స్కూల్‌లోని హాసల్ నిర్వహణ సంస్థ వీరన్నస్వామి పొదుపు సంఘాలకు 30 శాతం, కౌతాళం జడ్పీ ఉన్నత పాఠశాలలోని కీర్తి ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ, మంత్రాలయం మండలం బూదూరు గ్రామంలో సీజనల్ హాస్టల్ నిర్వహించే కలబంద కళాపరిషత్ స్వచ్ఛంద సంస్థకు 15 శాతం చొప్పున నిధుల్లో కోత పెట్టినట్లు వివరించారు. ఇవే తప్పులే పునారావృత్తమే ఆర్ఆర్ యాక్ట్ కింద రికవరీ చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణ స్టేట్ ఆర్ట్ ప్రదర్శనలో కోటేష్ పెయింటింగ్

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్‌కు అరుదైన అవకాశం దక్కింది. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో టార్చ్, కళాయజ్ఞం సంస్థలతో " శిలా నిశ్శబ్దం" పేరిట కాకతీయుల శిల్పకళా వైభోగం గురించి కాకతీయుల కట్టడాలపై పెయింటింగ్స్ వేయాలని తెలిపారు. "శిలా నిశ్శబ్దం" పేరిట నిర్వహించే ఈ కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల నుండి 60 మంది చిత్రకారులు పాల్గొన్నారు. ఇందులో నంద్యాలకు చెందిన చిత్రకారుడు కోటేష్ వేసిన చిత్రానికి కూడా స్థానం దక్కింది. ఈనెల 12,13,14 మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో వున్న స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శనలో ఈ చిత్రాన్ని ప్రదర్శిస్తారు.



ఎంపికైన చిత్రం



చిత్రాన్ని గీస్తున్న కోటేష్

ఏఎల్ఎస్‌సీవో పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కోఆర్డినేటర్(ఏఎల్ఎస్‌సీవో) పోస్టుకు డిప్యుటేషన్ ప్రాతిపాదికన అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఏపీసీ ప్రేమంత్‌కుమార్ తెలిపారు. ఏపీసీ మాట్లాడుతూ ఏఎల్ఎస్‌సీవో సెక్టోరియల్-1 పోస్టుకు డిప్యుటేషన్ ప్రాదిపతికన ఫారిన్ సర్వీస్ నియమ నిబంధనలను అనుసరించి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో ఎనిమిదేళ్ల సర్వీసు కలిగి 2025 మార్చి 31 నాటికి 55ఏళ్లలోపు వయస్సు ఉన్న పాఠశాల సహాయకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 10వతేదీ నుంచి 17వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఆగ్రోస్ కళ..కళ..

- మళ్లీ రైతులతో సందడి
- వ్యవసాయ యాంత్రీకరణకు రూ.5.60 కోట్లు



ఆగ్రోస్ కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆగ్రోస్ సంస్థకు కూటమి ప్రభుత్వం మళ్లీ జవసత్వాలు కల్పించింది. గతంలో ముఖ్యమంత్రులుగా పని చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో పాటు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో ఆగ్రోస్ సంస్థ ఒక వెలుగు వెలిగింది. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల కోసం ఈ సంస్థ కార్యకలాపాలు కొనసాగించింది. రైతులకు యంత్ర పరికరాలు అందించడమే కాకుండా మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్ తదితర సంస్థల ద్వారా రైతుల నుంచి పంట ఉత్పత్తులను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు సేకరించి గోదాముల్లో నిల్వ చేసే కార్యక్రమానికి ఆ సంస్థ పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆగ్రోస్ నిర్వీర్యమై పోయింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ సంస్థకు సంబంధించిన ఆస్తులన్నీ కబ్జా చేసేందుకు ఆనాటి పాలకులు చేయని ప్రయత్నమంటూ లేదు. కర్నూలు నగరంలో రూ.100 కోట్లు విలువ చేసే ఆగ్రోస్ స్థలాన్ని ఏకంగా పార్టీ కార్యాలయానికి లీజుకు తీసుకుని ఏడాదికి ఎకరాకు కేవలం రూ.35 చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. నిత్యం రైతులతో కళకళలాడిన ఈ కార్యాలయం ప్రస్తుతం కల్లూరు ప్రాంతంలో మారుమూల పాడుబడిన ఓ గోదాములో కొనసాగేలా ఆనాటి పాలకులు తీసుకున్న చర్యలను రైతులను కడుపు మండేలా చేసింది. ఇక ఈ సంస్థ కనుమరుగవుతుందనే భయంతో ఉన్న అన్నదాతలకు కూటమి ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

రూ.5.60 కోట్లతో రైతులకు యంత్ర పరికరాలు.. కళకళలాడుతున్న ఆగ్రోస్ కార్యాలయం

కూటమి ప్రభుత్వం ఆగ్రోస్ సంస్థను మళ్లీ బతికించాలనే లక్ష్యంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను రైతుల కోసం ఈ సంస్థకు అధికారాలను ఇచ్చింది. కర్నూలు జిల్లాలో రూ.2.80 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.2.85 కోట్లుతో వ్యక్తిగతంగా అర్హులైన రైతులందరికీ పంటల సాగు కోసం పరికరాలను అందించేందుకు చర్యలు చేపట్టింది. రైతులకు వ్యక్తిగతంగా నాణ్యమైన వ్యవసాయ పరికరాలను అందించేందుకు వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) మళ్లీ సిద్ధమైంది. 2024-25 సంవత్సరానికి దాదాపు 3.500 మంది రైతులకు వ్యక్తిగత పరికరాలు, పనిముట్లు ఇవ్వాలని ఈ సంస్థ అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని సంస్థకు తమ వంతు మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనే నేరుగా జమ చేయాలని వ్యవసాయ శాఖ యంత్రాంగం రైతులకు విజ్ఞప్తి చేయడం జరిగిందని ఉమ్మడి జిల్లా ఆగ్రోస్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి విలేకరులకు తెలిపారు.

ఈ నెలలోనే పరికరాల పంపిణీ

రైతులకు యాంత్ర పరికరాల పంపిణీని ఈ నెలాఖరు లేదా, వచ్చే ఏడాది ఏప్రిల్ నెలలో పూర్తి చేసి రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి పంటల సాగుకు అవసరమైన పనిముట్లను అన్నదాతలకు అందించేలా ఆగ్రోస్ సంస్థ అధికారులు కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారు. దాదాపు 3,500 మంది రైతులకు వ్యక్తిగతంగా పరికరాలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామన్నారు.



ఆకాశ వీధిలో..

కర్నూలు రూరల్, 10 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు పూటకో రూపంలో దర్శనమిస్తూ ఔరా అనిపిస్తున్నాడు. ఉదయం బాలసూర్యప్రభాకలితంబై... మధ్యాహ్నం భగభగలాడుతూ రుద్రుడిలా... సాయంత్రాన భూమి, ఆకాశానికి సింధూర తిలకంలా త్రివిధ రూపాల్లో అందరినీ కట్టిపడేస్తున్నాడు. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో కర్నూలు నగర శివారులోని తుంగభద్ర తీరంలో సూరీడు సింధూర వర్ణంలో కనిపించగా, ఆకాశం నీలిరంగులో కనిపించింది. ఇదే సమయంలో తుంగభద్రమ్మ సైతం వయ్యారాలుపోతున్నట్లు, జలాలన్నీ సింధూర రంగులోకి మారిన అద్భుత దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కర్నూలు.



సంధ్యావేళ.. చేపల వేటలో కొంగ



సింధూర వర్ణంలో తుంగభద్ర జలాలు

'జీవో నెంబరు 35తో అన్యాయం'

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పాలనా సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 35తో తమకు అన్యాయం జరుగుతుందని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్ రెడ్డి అన్నారు. ఎంపీడీవో నేరుగా నియామక కోటాలు రద్దు చేసినందున తమ పదోన్నతికి ఇబ్బంది కలుగుతుందని చెప్పారు. నిష్పత్తి ప్రకారం పదోన్నతి ప్రక్రియ కొనసాగితే భవిష్యత్తులో పరిపాలన అధికారి స్థాయి నుంచి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పదోన్నతి తీరని కలగా మిగులుతుందన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి ఆమోద్య యోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

బంగారు నగలు, నగదు చోరీ

మహానంది, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తిమ్మాపురం గ్రామంలోని భక్త శేషారెడ్డి ఇంటిలో దొంగలు చోరీ జరిగినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. భక్త శేషారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి ఇంటికి తాళం వేసి అనంతపురం జిల్లా తాడిపత్రిలోని తన బంధువుల ఇంటికి ఉగాది పండుగకు వెళ్లారు. బుధవారం తిరిగి స్వగ్రామం చేరుకొని ఇంటి వద్దకు రాగానే తులపులు పగలకొట్టి, బీరువా తెరచి ఉండటం గమనించిన ఇంటి యజమాని తన ఇంటిలో చోరి జరిగిందని నిర్ధారించుకొని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంటి తలుపులు పగలకొట్టి బీరువాలోని రూ.2 లక్షల నగదుతో పాటు 5 తులాల బంగారు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారని చెప్పారు. గురువారం ఉదయం ఎస్ఐ ఆధ్వర్యంలో ఘటనా స్థలాన్ని పోలీసు సిబ్బంది పరిశీలించారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మందుబాబుల దాడి.. వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరోరా నగర్ బీ.క్యాంపు క్వాటర్స్‌లో మందు బాబుల దాడిలో హరినాథ్ రెడ్డి (58) అనే వ్యక్తి మృతి చెందాడు. హరినాథ్ రెడ్డి ఇంటి పక్కనే ప్రభుత్వ క్వాటర్స్‌లో డేవిడ్ రాజు, రాహుల్, జితేంద్ర అనే వ్యక్తులు అనధికారికంగా నివాసముంటున్నారు. ఇటీవల ఈ ముగ్గురు మరి కొంత మంది స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తూ అల్లరి సృష్టిస్తున్నారు. ఈ నెల 3వ తేదీన ఈ ముగ్గురు మద్యం తాగి అల్లరి చేస్తుండటంతో హరినాథరెడ్డి వారిని మందలించాడు. మద్యం మత్తులో ఉన్న ఆ ముగ్గురు హరినాథరెడ్డిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఆసుపత్రిలో కోలుకోలేక గురువారం మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

ఆస్తి విషయంలో తాతపై మనవడి దాడి

మిడుతూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తాతపై మనవడు దాడి చేసిన ఘటన మండలంలోని చింతలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. చింతలపల్లి గ్రామానికి చెందిన మధు కుమార్ అను వ్యక్తి ఆస్తి విషయంలో అతడి తాత వడ్డె మద్దయ్యపై బుధవారం కర్రతో దాడి చేశాడు. ఈ దాడిలో మద్దయ్య ఎడమ కాలుకు తీవ్రగాయాలు అయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం బంధువులు కర్నూలుకు తరలించారు. మద్దయ్య మనవరాళ్లు రేణుక, మహాలక్ష్మీ ఫిర్యాదు మేరకు మధు కుమార్, అతడి భార్య మౌనిక, అత్త తులశమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

వాహనం దగ్ధం

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం తీవ్రమైన ఎండవేడిమి వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి ఒక మొబైల్ ఫ్రూట్ జ్యూస్ వాహనం దగ్ధమైంది. వివరాలివీ.. రాజస్థాన్‌కు చెందిన షోభాలాల్ అనే వ్యక్తి పట్టణంలో హోసూరు రోడ్డులో ఉన్న చేనేత కాలనీలో ఇంటిని అద్దె తీసుకుని నివాసం ఉంటున్నారు. ఆయన ప్రతిరోజు తన మొబైల్ వాహనంలో ఫ్రూట్ జ్యూస్ పట్టణంలో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే మూడు రోజులుగా ఇంటి దగ్గర లోనే పార్కింగ్ చేసుకున్నారు. అయితే గురువారం ఉదయం 11.30 గంటల తర్వాత ఎండవేడిమి తీవ్రతకు వాహనంలో మంటలు వ్యాపించాయి. గమనించిన కాలనీ వాసులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది చేరుకునే లోపే వాహనం పూర్తిగా మంటలకు దగ్ధమైంది. వాహనం అగ్నికి పూర్తిగా దెబ్బతినడంతో రూ.8 లక్షల దాకా నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.



కాలిపోయిన వాహనం

శ్రేయా గ్రూప్ మోసంపై కొనసాగుతున్న విచారణ

కర్నూలు క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో లక్నోకు చెందిన శ్రేయా ఇన్‌ఫ్రా మార్కెటింగ్ అనే సంస్థ చేసిన మోసంపై విచారణ కొనసాగుతున్నది. ఈ సంస్థ కర్నూలు చెందిన కొంత మందితో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టించుకుని తిరిగి చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కర్నూలు చెందిన వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తి గత ఏడాది నవంబరులో కోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఆదేశాల మేరకు మూడో పట్టణ పోలీసులు గత ఏడాది నవంబరులో కేసు నమోదు చేశారు. గత ఐదు నెలలుగా సంస్థలో జరిగిన లావాదేవీలపై పోలీసులు విచారిస్తున్నారు. ఈ విషయంపై సీఐ శేషయ్యను వివరణ కోరగా.. తమకు ఫిర్యాదు ఇచ్చిన మాట వాస్తవమేనని, ఈ సంస్థలో జరిగిన మోసాలపై విచారిస్తున్నామన్నారు.

నేడు జ్యోతిరావు పూలే జయంతి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కర్నూలు బిర్లాగేటు కూడలిలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ సాధికారిత అధికారి ప్రసూన గురువారం తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వివిధ బీసీ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి

- చిన్నభూంపల్లి గ్రామంలో అర్ధరాత్రి ఘటన
- ఇంటి గేటును ఢీకొట్టి.. భార్యాభర్తలపై దాడి
- గాయపడిన వారిని ఆసుపత్రికి తరలింపు.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



గాయపడిన టీడీపీ కార్యకర్త లక్ష్మన్న, భార్య హైమావతి



అంబులెన్స్‌లో ఆసుపత్రికి..

కోసిగి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నభూంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కొలిమి లక్ష్మన్న, హైమావతి దంపతులపై వైసీపీకి చెందిన గ్రామ సర్పంచ్ కే. చిన్నహుశేనీ తదితరులు బుధవారం అర్ధరాత్రి దాడి చేశారు. గ్రామానికి చెందిన గంగి హుశేనీ, కల్లూరు లక్ష్మయ్య, పుడితిని సోమిరెడ్డితో, సర్పంచ్ చిన్న హుసేనీ కలిసి లక్ష్మన్న, హైమావతి దంపతుల ఇంటి గేటును బైక్‌తో ఢీకొట్టి, ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులపై విచక్షణారహితంగా గూటాలతో దాడి చేశారు. వైసీపీ నాయకుల చేతుల్లో దెబ్బలు తింటున్న దంపతులను చుట్టుపక్కల వారు వచ్చి రక్షించారు. చిన్నభూంపల్లి గ్రామంలో సర్పంచ్‌పై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకే మనసులో పెట్టుకుని తమపై దాడి చేశారని బాధితులు తెలిపారు. తమ ఇంటి మీద వైసీపీ నాయకులు దాడి చేయడానికి తీసుకొచ్చిన బైక్‌ను అక్కడే వదిలి పారిపోయారని కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం 108లో వారిని ఆదోని ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ హనుమంతరెడ్డిని వివరణ కోరగా.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కర్నూలులో టీడీపీ కార్యకర్తపై దాడి

కర్నూలు క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కల్లూరు దర్వాజ వెళ్లే రహదారిలో టీడీపీ కార్యకర్త షేక్ ఇంతియాజ్ అనే వ్యక్తిపై దాడి జరిగింది. ఉస్తాద్ మహబూబ్ ఆలి అనుచరులు సమీర్, కలాంలు ఈ దాడి చేశారు. వైసీపీకి చెందిన ఉస్తాద్ మహబూబ్ ఆలి అనే వ్యక్తి అక్రమాలపై ఇంతియాజ్ రెండు మూడుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నకిలీ పట్టాల కేసులో ఉస్తాద్ రిమాండ్‌కు కూడా వెళ్లాడు. ఇది మనసులో ఉంచుకున్న అతని అనుచరులు ఇంతియాజ్‌పై బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో దాడి చేసి గాయపరిచారు. ఆయనను ఆసుపత్రికి తరలించారు. గురువారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామయ్య నాయుడు తెలిపారు.

వలస కూలీ ఆత్మహత్య

- అప్పుల బాధ తాళలేక గుంటూరులో పురుగు మందు తాగి బలవన్మరణం

గోనెగండ్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక వలస వెళ్లిన చోటనే పురుగు మందు తాగి బైలుప్పల గ్రామానికి చెందిన తలారి చిన్న రంగన్న(41)ఆత్మహత్య చేసుకున్నాడు. గోనెగండ్ల మండలం బైలుప్పల గ్రామానికి చెందిన తలారి చిన్న రంగన్న తన భార్య, కుటుంబసభ్యులతో కలసి గత నెల మొదటి వారంలో గుంటూరు జిల్లా కట్ట చెరుకూరు మండలం చింతపల్లిపాడు గ్రామానికి బతుకు తెరువు కోసం వలస వెళ్లాడు. అక్కడ మిర్చి పని చేసే వారు. అయితే చిన్న రంగన్నకు స్వగ్రామం బైలుప్పలలో దాదాపు రూ. 15 లక్షల వరకు అప్పు ఉంది. అప్పులు తీర్చడం ఎలాగో తెలియక మనోవ్యథకు గురై గత నెల 31వ తేదిన రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తీసుకు వచ్చారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున చిన్న రంగన్న మృతి చెందాడు. భార్య రాములమ్మ గుంటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గురువారం బైలుప్పలలో దహనసంస్కరాలు చేసినట్లు బంధువులు తెలిపారు.

పూలే జయంతిని జయప్రదం చేయండి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్



మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలులో బిర్లాగేటు సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించే జ్యోతిరావుపూలే జయంతిని జయప్రదం చేయడానికి అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందున రాష్ట్ర కమిటి తరుపున సీఎం చంద్రబాబుకు వై.నాగేశ్వరరావు యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీజీ వెంకటేశ్, ఎం.మహేష్ యాదవ్, ప్రతాప్, శ్రీనివాసులు, భాస్కర్, శ్రీరాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల రూరల్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ ప్లీనరీ సమావేశానికి ఆయన ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై తీర్మానం చేసినట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కరువు, ఉపాధి పనులు, వలసలు, సాగునీటి ప్రాజెక్టులను ఏఐసీసీ ముందుకు తీసుకెళ్లామన్నారు. ప్రజా సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉందన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పలు సమస్యలపై చర్చించామన్నారు. పార్టీ ఎల్లప్పుడు ప్రజలకు అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గే ప్రసక్తే లేదని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. అదేవిధంగా కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులను లక్ష్మీనరసింహయాదవ్ కలిశారు.



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో లక్ష్మీనరసింహ యాదవ్

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన విధంగా మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఏపీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని క్రాంతినగర్‌లోని ఏపీ మోడల్‌స్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన భోజన నాణ్యతను పరిశీలించారు. దస్త్రాలను పరిశీలించారు. అనంతరం దేవనగర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహాల్లో మెనూ విషయంలో వార్డెన్లు రాజీపడకూడదని సూచించారు. సివిల్ సప్లయీస్ ఇన్‌చార్జి డీఎస్‌వో రాజు, ఏఎస్‌వో రవిబాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

కలెక్టర్‌ను కలిసిన చైర్మన్ : జిల్లా పర్యటనలో ఉన్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి గురువారం కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి ఆయన పుష్పగుచ్ఛం అందించారు.

గుంటూరులో వలస కూలీ మృతి

నందవరం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామానికి చెందిన పీరమ్మ(32!) బతుకు తెరువు కోసం గుంటురుకు వలస వెళ్లి గురువారం అక్కడే మృతి చెందింది.. పీరమ్మ గురువారం కూడా మిరప పంట కోతకు వెళ్లింది. మధ్యాహ్నం వరకు బాగా పని చేసి, ఒంట్లో నలతగా ఉండి వడదెబ్బతో సొమ్మసిల్లి పడి పోయింది. తోటి కూలీలు వెంటనే గుంటురు ఆసుపత్రికి తరలించే మార్గ మధ్యంలో పీరమ్మ మృతి చెందింది. వెంటనే మృతదేహాన్ని ముగతి గ్రామానికి తీసుకువచ్చారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నంద్యాలలో విజిలెన్స్ దాడులు

- రేషన్ షాప్‌లు, హోటళ్లలో తనిఖీ
- 5 గృహ వినియోగ సిలిండర్లుసీజ్
- హోటళ్ల నిర్వాహకులపై కేసులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గురువారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిం చారు. పలు రేషన్ దుకాణాలతో పాటు హోటళ్లను కర్నూలు జిల్లా విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐలు, ఎస్ఐల బృందం తనిఖీ చేసినట్లు తెలిపారు. పట్టణంలోని మూడు రేషన్ దుకాణాలను తనిఖీ చేసినట్లు వెల్లడించారు. జె.నాగన్న అనే డీలర్ నిర్వహిస్తున్న రేషన్‌షాప్‌లో 46చక్కెర ప్యాకెట్లు అధికంగా ఉన్నట్లు ఈపోస్ స్టాక్‌ను పరిశీలించగా బయటపడినట్లు తెలిపారు. ఈ మేరకు డీలర్ నాగన్నపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీలక్ష్మీశ్రీనివాస హోటల్, గ్రాండ్ ఫాస్ట్‌ఫుడ్, జావెద్‌హోటల్, గోల్డెన్ ఫుడ్ ప్లాజాలపై కూడా దాడిచేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో హోటళ్ల నిర్వాహకులు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను కాకుండా గృహ సంబంధిత గ్యాస్ సిలిండర్లను వాడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. దీంతో 5గృహ సంబంధిత గ్యాస్ సిలిండర్లను పంచనామా నిర్వహించి సీజ్ చేసినట్లు వెల్లడించారు. సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లను సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఈ మేరకు హోటళ్ల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారుల వెంట సివిల్ సప్లై అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం: మంత్రి



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్/మున్సిపాలిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను కలెక్టర్ రాజకుమారితో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ జాబ్‌మేళాలో 14 పేరుపొందిన కంపెనీలు పాల్గొని 589 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. మంత్రి తనకు తెలిసిన అనేక కంపెనీలు నంద్యాలలో జాబ్‌మేళాలను ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కోర్ సబ్జెక్టుల్లో కమాండ్ రోల్ ఉండడంతో పాటు అదనపు నైపుణ్యాల్లో శిక్షణ తీసుకుంటే పోటీ పరీక్షల్లో నెగ్గుకుని రాగలరని అన్నారు. డీఎస్‌డీవో శ్రీకాంత్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీధర్‌రెడ్డి, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సోమశివారెడ్డి, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, కోఆర్డినేటర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలి

నంద్యాల క్రైం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు సూచించారు. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు గురువారం నిర్వహించిన కో ఆర్డినేషన్ సమావేశంలో హాజరైన ప్రభుత్వ శాఖల అధికారులకు ఏఎస్పీ పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల నియంత్రణకు కమిటీని ఏర్పాటు చేసి అది ప్రణాళికాబద్ధంగా పనిచేసేలా చూడాలన్నారు. జిల్లాలోని ఫ్యాక్టరీలలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు పనిచేస్తుండున్న గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను ఆయా కర్మాగారాల్లోకి అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు యాజమాన్యాలు పక్కాగా వ్యవహరించాలన్నారు. మెడికల్ షాపుల్లో డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా నిద్రమాత్రలు విక్రయించకుండా డ్రగ్స్ కంట్రోల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని పర్యాటక కేంద్రాలు, ప్రదేశాలపై కూడా నిఘా వేసి ఉంచాలన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగించినా, విక్రయించినా, రవాణా చేసినా అటువంటివారి సమాచారం వెంటనే 1972టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏఎస్పీ తెలిపారు.

పొదుపు మహిళలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రసాదరావు

శ్రీశైలం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో గురువావం మల్లికార్జున సదనంలో సీఐ జి. ప్రసాదరావు పొదుపు మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పొదుపు గ్రూపు లీడర్లు సమయాని పొదుపు కట్టుకోవాలని, బుక్ కీపర్లు పొదుపు మహిళలు కట్టిన డబ్బును అవకతవకలు లేకుండా సరైన సమయానికి బ్యాంకులో జమ చేయాలని సూచించారు. అలాగే ఆన్లైన్ మోసాలు (ఓటీపీ), జాబ్, మ్యాట్రిమోనీ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వేసవి సెలవుల్లో పిల్లలు ఈతకు వెళ్లకుండా చూసుకోవాలని, తమ భర్తలు, పిల్లలు బెట్టింగ్ యాప్స్ బారిన పడకుండా, రోడ్ సేఫ్టీ గురించి తీసుకోవాలసిన జాగ్రత్తలను డ్వాక్రా మహిళలకు సీఐ వివరించారు.

బకాయిలు చెల్లించాలి



ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

నందికొట్కూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ డిమాండ్ చేశారు. నందికొట్కూరు ఆర్టీసీ డిపో ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన తెలిపారు. సుధాకర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నైట్ అవుట్ అలవెన్సులను వెంటనే చెల్లించాలని, తగ్గించిన నైట్ అవుట్ అలవెన్సును రూ.150 నుంచి 300లకు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఎన్‌క్యాష్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలన్నారు. గ్యారేజ్ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని, అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్‌ని వెంటనే నిలిపివేయాలని, ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ విధానం ప్రకారం ఇవ్వవలసినటువంటి సెలవులను వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

మసీదులు స్వాధీనం



మసీదును స్వాధీనం చేసుకుంటున్న మైనార్టీ శాఖ అధికారులు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సీఈవో ఉత్తర్వుల మేరకు నంద్యాల పట్టణంలోని చౌక్ మసీదు, లేటీఫియా మసీదుల ముతవల్లీలైన ఇమ్రాన్, జావిద్‌ను రాష్ట్ర వక్ఫ్ బోర్డు సస్పెండ్ చేసి మసీదులకు నోటీస్ అతికించారు. మసీదుల రికార్డులు సరిగా లేకపోవడంతో ప్రభుత్వ అధికారులైన జిల్లా మైనారిటీ అధికారి సబిహా పర్వీన్, జిల్లా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్ చౌక్ మసీద్, లేటీఫియా మసీదులను వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఆధీనంలోకి తీసుకున్నారు.. వీరి వెంట విజయవాడ వక్ఫ్ బోర్డు అధికారులు మురద్ అన్సారీ, అల్తాఫ్ హుస్సేన్, ముస్లిం మత పెద్ద మనియార్ ఖలీల్ ఉన్నారు.

అడ్డుగోలు దోపిడీ

- బస్టాండులో అధిక ధరకు తినుబండారాల విక్రయం
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వ్యాపారులు



నంద్యాల ఆర్టీసీ బస్టాండు

నంద్యాల టౌన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఆర్టీసీ బస్టాండులో ధరల దోపిడీ విచ్చలవిడిగా సాగుతోంది. ప్రాంగణంలోని స్టాళ్ల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా తినుబండరాలు, తాగునీరు, శీతల పానీయాలపై ఎమ్మార్పీ కంటే రూ.5 నుంచి రూ.10 వరకు ప్రయాణికులకు విక్రయిస్తున్నారు. సమోసా, పఫ్స్, స్నాక్స్ నీళ్లపై, అధికంగా వసూళ్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఎండకాలం కావడంతో ప్రయాణికులు నీళ్ల తప్పని సరిగా ఎక్కువ ధర చెల్లించి కొంటున్నారు. అధిక ధర ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తే వ్యాపారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు.

నంద్యాల ఆర్టీసీ బస్టాండుకు రోజూ వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. ఇక్కడికి ఎక్కువగా తిరుపతి నుంచి హైదరాబాద్‌కు, బెంగళూరుకు, అలాగే దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఇదే అదునుగా చేసుకున్న స్థానిక స్టాళ్ల నిర్వాహకులు అధిక వసూళ్లకు పాల్పడుతున్నారు. మల విసర్జనకు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. మూత్ర విసర్జనకు డబ్బులు వసూలు చేయకూడదు. అయితే నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్వాహకులు ముక్కుపిండి వసూలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది.

ఇటీవల బనగానపల్లెకు చెందిన పవన్‌కుమార్ అనే వ్యక్తి నీళ్ల బాటిల్ కొనడానికి వేళ్తే బాటిల్‌ధర రూ.30 చెప్పారు. ఎందుకు అని అడగగా అవసరం ఉంటే తీసుకో లేకుంటే ఫిర్యాదు చేసుకో అని దురుసుగా ప్రవర్తించారు. చేసేదేమీ లేక లూజ్ వాటర్ బాటిల్ ధర రూ.20 ఇచ్చి కొనుగోలు చేశారు.

నంద్యాలకు చెందిన ఓ వ్యక్తి మల్లికార్జున రాత్రి 11 గంటల సమయంలో దోస కోసం వెళ్లగా రూ.50 చెప్పారు బయటికి కంటే అధికంగా రూ.10 అడగడంతో ఎందుకు అని అడగడంతో మాకు గిట్టుబాటు కాదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

ప్రయాణికుల నుంచి ఆర్టీసీ ప్రాంగణంలోని స్టాళ్ల నిర్వాహకులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే మొదటి సారిగా జరిమానాలు విధిస్తాం. తర్వాత కూడా అధికంగా వసూలు చేస్తే టెండర్‌ను రద్దు చేస్తాం.

ఎ.గంగాధర్‌రావు, డిపో మేనేజర్

ముస్లింలకు ఉచిత సామూహిక వివాహాలు



సామూహిక వివాహాలు జరిపిస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల అంజుమన్ సంస్థ అధ్యక్షుడు హాజీ నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ అధ్యక్షతన అంజుమన్ షాదిఖానాలో 12 పేద ముస్లిం జంటలకు సామూహిక వివాహం జరిపించారు. గురువారం జరిగిన ఈ సామూహిక వివాహాలకు ఇమాముల సంఘం అధ్యక్షుడు హఫీజ్ అమ్జద్ బాషా సిద్దిఖీ, జమాతే ఇస్లామీ హింద్ నంద్యాల అధ్యక్షుడు షేక్ అబ్దుల్ సమద్, అంజుమన్ ఉపాధ్యక్షుడె అబ్దుల్ హఖ్ ఆధ్వర్యంలో లో 12 జంటలకు సామూహిక వివాహం అనంతరం ఒక్కో వధువుకు రూ.50వేల చెక్కు అందజేశారు. అనంతరం నిర్వహకుడు హాజీ నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ పేద ముస్లింలు నాలుగు జంటలువస్తే ఎప్పుడైనా వివాహాలు జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో వివాహాలు చేసుకున్న ముస్లింల బంధువులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన వైసీపీ నాయకులు



మాజీ సీఎం జగన్‌ను కలిసిన వైసీపీ నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ గురువారం తాడేపల్లిలోని తన నివాసంలో నంద్యాల జిల్లా నేతలతో సమావేశమయ్యారు. ఇందులో భాగంగా శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో పాటు ఆ పార్టీ మండల, పట్టణాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ స్థితిగతుల గురించి మాజీ సీఎం జగన్ ఆరా తీసినట్లు నాయకులు తెలిపారు. కాగా నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి ముఖ్యనాయకులను మాజీ ఎమ్మెల్యే శిల్పా మాజీ సీఎం జగన్‌కు పరిచయం చేశారు.

పీఎఫ్‌ను చెక్కు రూపంలో అందించాలి

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఓపీఎస్ ఉపాధ్యాయుల జీపీఎఫ్ అమౌంట్‌ను చెక్కుద్వారా గానీ, పీఎఫ్ అకౌంట్‌కు బదిలీ చేయాలని జిల్లా ఉపాధ్యాయ ఐక్యసంఘం నాయకులు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్‌ను కోరారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ శివయ్య, అబ్దుల్‌కలాం, వరప్రసాద్, నగిరిశ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, సాంబశివుడు, అరవిందకుమార్, దస్తగిరిబాషలు మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యంలో భాగంగా మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేశారని, వారికి మున్సిపాలిటీ నుంచి రావాల్సిన పీఎఫ్‌ను చెక్కు ద్వారా చెల్లించాలని కోరారు. అలాగే 2022 సంవత్సరం నుంచి మున్సిపల్ పరిధిలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ మొత్తాలను కూడా చెక్కు రూపంలో ఇవ్వాలని కోరారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే నివాళి



ఫణిభూషణ్ రెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

మిడుతూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరాపురం గ్రామ సర్పంచ్ ఫణిభూషణ్ రెడ్డి బుధవారం అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య భైరాపురం గ్రామం చేరుకుని ఫణిభూషణ్ రెడ్డి మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకులు సర్వోత్తమ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మొల్లా చాకర్ వలి, షరీఫ్ బాషా ఉన్నారు.

హైవే పనులను అడ్డుకున్న చర్చి నిర్వాహకులు

- పాములపాడులో ఉద్రిక్తత



పనులను అడ్డుకుంటున్న చర్చి నిర్వాహకులు

పాములపాడు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములపాడు గ్రామ శివారులో జెరుషలేంశాల వద్ద నేషనల్ హైవే 340 సి నిర్మాణపు పనులను చర్చి నిర్వాహకులు గురువారం అడ్డుకున్నారు. నేషనల్ హైవే పీడీ పద్మ, తహసీల్దార్ సుభద్రమ్మ, చర్చి నిర్వాహకులతో చర్చించారు. నేషనల్ హైవే అధికారులకు సహకరించాలని కోరారు. దీంతో తమ సర్వే నెంబర్ సబ్ డివిజన్ చేయాలని అధికారులకు సూచించారు. కోర్టులో ప్రభుత్వానికి అనుకూలంగా అనుమతులు వచ్చాయని, కలెక్టర్ కూడా తొలగించాలని చెప్పి సమయం ఇచ్చారని, పనులకు అడ్డుకోకుండా సహకరించాలని కోరారు. దీంతో కోర్టులో ఇంకా కేసు నడుస్తుందని ఎలా పగులగొడతారని నిర్వాహకులు ప్రశ్నించారు. దీంతో అధికారులు చర్చిని కూల్చబోమని, ఆవరణలోని చెట్ల వరకు నిర్మాణపు పనులు చేపడతామని యంత్రాలతో పనులు ప్రారంభించారు. అయితేనిర్వాహకులు యంత్రాలకు అడ్డుపడ్డారు. దీంతో సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేశ్‌కుమార్ పోలీసులతో వారిని జరిపే ప్రయత్నంలో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. దీంతో పోలీసులు, అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. చర్చి నిర్వాహకులు తమకు న్యాయం జరగాలని అధికార్లు డౌన్ డౌన్ అంటూ ప్లకార్డులు చేతపట్టి చర్చి ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల సుంకులమ్మ వీధిలోని సుంకులా పరమేశ్వరీ దేవస్థానం ఆలయ చైర్మన్ డా. రవికృష్ణ ఆధ్వర్యంలో గురువారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.1,92,350 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి నాగన్న, సభ్యులు మురళి, ప్రసాద్, పుల్లయ్య, భక్తులు పాల్గొన్నారు.

లో లెవల్ వంతెనలకు మహర్దశ

- నిధులు మంజూరుతో ప్రారంభమైన పనులు



బొల్లవరం ప్రధాన రహదారిలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు



మహానంది నుంచి ఎంసీ ఫారం మధ్య రోడ్డు పనులు

మహానంది, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహానంది మండలంలో అప్పటి కాలానికి అనుగుణంగా నిర్మించిన పురాతన వంతెనలు శిథిలావస్థకు చేరుకొన్నాయి. దీంతో వర్షాకాలం వచ్చిందంటే ఈ రహదారుల్లో రాకపోకలు నిలిచిపోతాయి. దీనిపై ప్రజలు పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళిన ఫలితం లేకపోయింది.గత వైసీపీ హాయంలో లో లెవల్ వంతెనలపై నిధుల కొరతతో పట్టించుకోలేదు. ప్రజల విన్నపాలను పెడచెవిన పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యంగా రహదార్లను అభివృద్ధి పర్చాలని భావించింది. ఇందుకు తగ్గట్టుగా నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులు కూడ వేగవంతంగా జరుపుకోవడంతో వచ్చే వర్షాకాలం నాటికి సమస్య తీరుతుంది.

మహానంది మండలంలో ప్రధాన రహదార్ల వద్ద మూడు చోట్ల లోలెవెల్ వంతెనలు ఉన్నాయి. వర్షాకాలంలో వంతెనల పైభాగంలో నీరు అధిక స్థాయిలో ప్రవహించడంతో ఎక్కడి వాహనాలు నిలిచి పోవడంతో దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. వంతెనలపై ప్రవాహం తగ్గడానికి కనీసం మూడు రోజులు పట్టేది. మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యపై ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్‌రెడ్డి చొరవ చూపి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. దీంతో మండలంలోని నంద్యాల-మహానంది ప్రధాన రహదారి బొల్లవరం రాళ్ళవాగు లో లెవెల్ వంతెనకు రూ.60 లక్షల నిధులతో మంజూరు కావడంతో నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే మహానంది నుంచి గాజులపల్లి వెళ్ళే ప్రధాన రహదారిలో ఎంసీ ఫారం వద్ద ఉన్న పురాతన పాలేరు వాగు వంతెన ఆధునికీకరణకు కూడా రూ.2 కోట్ల నిధులు మంజూరు కానున్నాయి. ఇప్పటికే అధ్వానంగా గుంతలమయంగా ఉన్న ఈ రహదారిలోని 3 కిలో మీటర్ల ఆధునికీకరణ కోసం రూ. 8 కోట్ల నిధులు కేటాయించడంతో నిర్మాణ పనులు నెల క్రితం ప్రారంభమయ్యాయి. ఇలా మండలంలో వర్షాకాలంలో ప్రధాన సమస్యగా ఉన్న వంతెనలను ఆధునికీరణకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పనులు జరుగుతున్నాయి

మహానంది మండలం నంద్యాల- మహానంది ప్రధాన రహదారిలోని బొల్లవరం రాళ్ళవాగు వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసింది. నిర్మాణ పనుల కోసం టెండర్‌లు పిలిచాం. కాంట్రాక్టర్ పనులను ప్రారంభించాడు. మరో నెల రోజుల్లో నిర్మాణ పనులు పూర్తవుతాయి. అలాగే మహానంది నుండి గాజులపల్లి వెళ్ళే 3 కిలో మీటర్ల రహదారి పనుల కోసం రూ. 8 కోట్లు కేటాయించగా నిర్మాణపనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఇదే రహదారిలో ఉన్న పాలేరువాగు వంతెన కోసం మరో రూ. 2 కోట్ల నిధులు అవసరం. దీనికోసం ఉన్నతాధికార్లకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

- శ్రీధర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ

నందీశ్వర స్వామికి ఆర్జిత పరోక్ష సేవ



నందీశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

శ్రీశైలం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో గురువారం త్రయోదశి ఘడియలను పురస్కరించుకొని సాయంప్రదోషకాలంలో ఆలయంలోని మల్లికార్జునస్వామికి అభిముఖంగా కొలువైవున్న నందీశ్వరస్వామికి పరోక్ష సేవగా విశేష అభిషేకం, అర్చనలు జరిపించారు. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ నిర్వహించారు. అనంతరం నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, పలు ఫలోదకాలతో, కుంకుమోదకం, హరిద్రోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, మల్లికార్జున గుండంలోని శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నాభిషేకం జరిపారు. అభిషేకానంతరం నందీశ్వరస్వామికి నూతన వస్త్రసమర్పణ, విశేష అర్చనలు జరిపి, నానబెట్టిన శనగలను సమర్పించారు. తరువాత స్వామికి నివేదన సమర్పించారు. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో పూజలలో పాల్గొనేందుకు దేవస్థానం పరోక్షసేవల ద్వారా అవకాశం కల్పించింది. భక్తులు ఈ పరోక్షసేవలో పాల్గొనేందుకు దేవస్థానం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.శ్రీశైలదేవస్థానం.ఓఆర్‌జీ ద్వారా ఒక్కో పూజకు రూ. 1,116 సేవా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. సేవాకర్తలే కాకుండా, భక్తులందరూ కూడా నందీశ్వరస్వామి ఆర్జిత పరోక్షసేవ పూజా కార్యక్రమాన్ని శ్రీశైల టీవీలో గానీ, యూట్యూబ్‌లో గానీ వీక్షించవచ్చు.

26న వేలం

నంద్యాల రూరల్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములకు ఈనెల 26న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుగణశ్రీ పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. మూలసాగరం ఉన్న సర్వే నెంబరు 112-ఏలో 7.14 ఎకరాల మెట్ట భూమి, సర్వే నెంబరు 159లో 16.58 మెట్ట భూమి, సర్వే నెంబరు 1544-1లో 5.02 ఎకరాలు తడి భూమి లీజుకు ఇవ్వడానికి వేలం నిర్వహిస్తున్నారు. మూడేళ్ల కౌలుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు తగిన పత్రాలు తీసుకుని ఎంపీడీవో కార్యాలయంలో వివరాలు తెలుసుకోవచ్చని ఆమె తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల పట్టణంలో ఓమ్ని హాస్పిటల్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే, పుష్పగిరి కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. శిబిరంలో దాదాపు 250మందికి ఉచిత వైద్యపరీక్షలు చేయడంతోపాటు ప్రతిఒక్కరికీ ట్రాఫిక్ సైన్‌బోర్డు ద్వారా, ట్రాఫిక్ నిబంధనలు ఉన్న పోస్టర్ల ద్వారా రోడ్డుభద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆర్‌కే ఫంక్షన్‌హాల్‌లో పట్టణంలోని ఆటోడ్రైవర్లు, వివిధ స్కూల్ బస్సులు, ఆటోడ్రైవర్లకు, పోలీస్ సిబ్బందికి, ఇతరులకు బీపీ, షుగర్, ఈసీజీ, టుడీ ఎకో, కంటిచూపునకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. హైవేలలో ప్రయాణించేటపుడు సహాయం కోసం, ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినపుడు వెంటనే 1033టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.మల్లికార్జునగుప్తా, ఓమ్ని, పుష్పగిరి ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.11.93 లక్షల ఆదాయం

మహానంది, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మహానందిలో గురువారం నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా దేవస్థానానికి రూ.11.93 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందులో ఏడాది పాటు భక్తుల పాదరక్షలు భద్ర పరిచే హక్కును మహానందికి చెందిన వెంకటరమణ రూ.10.65 లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు. అలాగే ఆలయ పరిధిలో 10 ఇంటు 12 సైజు 24 స్థలాల్లో వ్యాపారం నిర్వహించుకొనేందుకు బహిరంగవేలం నిర్వహించగా నెలసరి అద్దె కింద రూ.60 వేలు, ఆలయ మాన్యం భూములు ఏడాది కౌలు కింద రూ.68 వేలు ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో యర్రమల్ల మధు, సిబ్బంది నాగమల్లయ్య, మల్లికార్జునయ్య, పసుపుల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

సున్నిపెంట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సున్నిపెంటలో మహాత్మా జ్యోతిబాపూలే(బీసీ) స్కూల్, గిరిజన సంక్షేమ శాఖ ఎక్సలెన్స్ స్కూల్‌ను ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. శుక్రవారం శ్రీశైల భ్రమరాంబామల్లికార్జునస్వామి వార్లను దర్శించుకోనున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం శ్రీశైలంలోని అంగన్వాడీ స్కూల్‌లు, రేషన్ షాపులను తనిఖీ చేస్తారు. తరువాత సున్నిపెంటలో రేషన్ షాపులు, అంగనాన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి అక్కడి నుంచి బయలు దేరి వెళ్లారు.


పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు పవన్‌కుమార్, గోపాల్ సూచించారు. మండలంలోని బైర్లూటి పీహెచ్‌సీలో గురువారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద 45 మంది గర్భిణీ స్త్రీలకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. స్కానింగ్ పరీక్షల నిమిత్తం ఇద్దరిని గుర్తించి ఆత్మకూరు సీహెచ్‌సీకి రెఫర్ చేశారు. సీహెచ్‌వో ఖుద్దూస్‌బాషా, స్టాఫ్ నర్స్ తులసి, ఆరోగ్య కార్యకర్త విశ్వనాథ్, ఎంఎల్‌హెచ్‌పీలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'న్యాయం చేయాలి'

వెలుగోడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వెలుగోడుకు చెందిన తమ సమీప బంధువు నంద్యాలలోని పలు బ్యాంకులలో తమ పేరిట ఖాతాలు తెరిచి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నాడని, న్యాయం చేయాలని షాలు బాషా కోరారు. అలాగే క్రెడిట్ కార్డులు సైతం తీసుకొని లావాదేవీలు నిర్వహిస్తున్నాడని చెప్పారు. సీఐ సురేష్ కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. బాధితులు ఫిర్యాదు చేయడానికి వచ్చిన విషయం వాస్తవమేనని చెప్పారు. ఈ ఘటనపై విచారించిన తర్వాత కేసు నమోదు చేస్తామని చెప్పారు.

మైనార్టీల హక్కులను హరించడం దారుణం



నందికొట్కూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

నందికొట్కూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మైనార్టీల హక్కులను హరించడం దారుణమని సీపీఐ జిల్లా నాయకుడు రఘురామ్మూర్తి అన్నారు. గురువారం పట్టణంలోని జైకిసాన్ పార్కు నుంచి పటేల్ సెంటర్ వరకు సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని చేపట్టారు. రఘురామ్మూర్తి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రాగానే భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లు ఆమోదిస్తూ తీర్మానం చేయడం మత సామరస్య ఐక్యతకు విఘాతం ఏర్పడుతుందన్నారు. ఈ బిల్లు భారత రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. ఏఐటీయూసీ నాయకులు మజీద్ మియా, రెహమాన్, మహ్మద్‌మియా, రఫి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రజిత, మహిళా సమాఖ్య సభ్యులు స్వర్ణలత, రూప, స్వాతి పాల్గొన్నారు.

బెల్ సరే.. మరి తాగునీరు..?

- పాఠశాలల్లో అలంకార ప్రాయంగా ఆర్‌వో ప్లాంట్లు
- రూ.లక్షలతో ఏర్పాటు.. నిర్వహణ లేక నిరుపయోగం
- మరమ్మతులపై ఫిర్యాదులు పట్టించుకోని ఏజెన్సీలు

చాగలమర్రి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపానికి గురి కాకుండా విద్యార్థులకు గంటకోసారి మంచినీరు తాగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ప్రభుత్వం ఆదేశించింది. అయితే వాటర్‌బెల్ కొట్టాక విద్యార్థులకు శుద్ధజలం ఎలా అందించాలో తెలియక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకంలో రూ.లక్షలు వెచ్చించి ఆర్‌వో ప్లాంట్‌లు మంజూరు చేసినా నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. మండలంలో మొదటి విడతలో 20 పాఠశాలలకు ఆర్‌వో ప్లాంట్‌లు మంజూరు చేశారు. కొన్నిచోట్ల పాఠశాలల్లో ఇప్పటికీ ఏ ర్పాటు చేయలేదు. మండల పరిధిలోని పలు పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్‌లు మూలన పడ్డాయి. చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలలో ఆర్‌వో ప్లాంట్‌లు పని చేయడం లేదు. పాఠశాలలో ఏర్పాటు చేసిన మినీ ట్యాంకుల ద్వారా వచ్చే నీటితో దాహం తీర్చు కుంటున్నారు. కొందరు విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచే నీటిని తెచ్చుకుంటున్నారు. బాలికల పాఠశాలలో ఆర్‌వో ప్లాంట్ మూతపడింది. ఏజెన్సీ వారు మరమ్మతులు చేయకపోవడంతో ప్రత్యామ్నాయంగా హెచ్ఎం విజయ లక్ష్మి స్పందించి శుద్ధ జలం కోసం సొంతంగా నెలకు రూ.2,500 ఖర్చు చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్‌లు పని చేయక పోవడంతో విద్యార్థులు మంచి నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో మూలన పడ్డ ఆర్‌వో ప్లాంట్‌లకు మోక్షం కల్పించి శుద్ధజల నీరు అందించేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


చాగలమర్రి బాలుర పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్


చాగలమర్రి బాలికల పాఠశాలలో నీరు పట్టుకుంటున్న విద్యార్థినులు

ఆర్‌వో ప్లాంట్లు పని చేయడం లేదు



గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు. అయితే కొన్ని చోట్ల ప్లాంట్లు పని చేయకపోవడం వాస్తవ మే. ప్రధాన పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్‌లు లేక విద్యార్థులు శుద్ధజల నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌వో ప్లాంట్‌ల మరమ్మతుల గురించి ఆయా పాఠశాలల హెచ్ఎంల ద్వారానే జిల్లా అధికారులకు యాప్‌ల ద్వారానే తెలియజేశాం.

\- న్యామతుల్ల, ఎంఈవో, చాగలమర్రి

రేపటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


చెన్నకేశవస్వామి ఆలయం


శ్రీదేవి భూదేవి చెన్నకేశవస్వామి

బేతంచెర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌరిపేటలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి 18 వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రూపు దేవాలయాల ఈవో మద్దిలేటి గురువారం తెలిపారు. 12న ప్రత్యేక పూజలు, 13న ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, ఉదయం 8.15 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం, సాయంత్రం హనుమద్ వాహనంపై స్వామివారి ఊరేగింపు, దీక్షా హోమం మహా మంగళహారతి ఉంటుందన్నారు. 14న గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు, 15న గజవాహన సేవ, 16న శేష వాహన సేవ, 17న రథోత్సవ కార్యక్రమం, 18న ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం పార్వేట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 18న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

కొలిమిగుండ్ల/డోన్‌టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఈనెల 20న జరగాల్సిన ప్రవేశ పరీక్ష 21వ తేదీకి మార్చినట్లు కొలిమిగుండ్ల మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, డోన్ ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. 20న ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యాశాఖ ఈ మార్పు చేసినట్లు తెలిపారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ మార్పును గమనించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ కోరారు. గురువారం పట్టణంలోని నెహ్రూ స్కూల్ ఉన్నత పాఠశాలలోని 44వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ భావిభారత పౌరులైన విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో మెలిగి సమాజానికి సేవలందించాలన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కోడూరు హరినాథ రెడ్డి, కోడూరు కమల్‌తేజారెడ్డి, రవితేజారెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ధైర్యంగా ఉండండి'

డోన్ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సూచించారని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం విజయవాడలోని తాడేపల్లి ప్యాలేస్‌లో నిర్వహించిన సమావేశంలో బుగ్గనతో పాటు డోన్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, డోన్ వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, పట్టణ, మండల అధ్యక్షులు మల్లికార్జున రెడ్డి, సోమేష్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

అవుకు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ అన్నారు. గురువారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రఘురాం, వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రశేఖర్, వెలుగు సీసీలు, వీఓఏలు, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

బేతంచెర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గర్భందాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకు గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డా.వైవీ ప్రియాంక అన్నారు. ప్రధాన మంత్రి సురక్షత మాతృత్వ అభియాన్‌పై గురువారం గర్భిణులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని ఎంపీ ఎస్సీ బేతంచెర్ల-3 వైద్యాధికారి డాక్టర్ వైవీ ప్రియాంక మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రసవించే వరకు ప్రతినెల వైద్యాధికారులను సంప్రదించి సూచనలు సలహాలు తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం గుడ్లు, పాలు, పండ్లు తీసుకోవడం వల్ల తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సదస్సులో వైద్యసిబ్బంది ఉన్నారు.

ప్యాపిలి: మండలంలోని జలదుర్గం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులకు భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ ఫర్ వర్కింగ్ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ హ్యూమన్ ఆక్టీవిటీస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలకు చెందిన 80 మంది గర్భిణులు భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

300 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం

చాగలమర్రి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో 300 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉందని ఉపాధి ఏపీవో ఖాసీం తెలిపారు. గురువారం మండలంలోని మద్దూరు గ్రామంలో ఉపాధి కూలీలు చేస్తున్న పనులను, మస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 1,300 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని అన్నారు. పండ్ల తోటలు సాగు చేసే రైతులకు మూడేళ్ల పాటు ఉపాధి నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వందశాతం సబ్సిడీతో పండ్ల తోటలకు రాయితీ ఉంటుందని అన్నారు. 16 రకాల పండ్లతోటలను సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఏ, టీఏలు ఉన్నారు.

నిలిచిన పనులు


అసంపూర్తిగా ఉన్న రాంపల్లె వంతెన

చాగలమర్రి, ఏప్రిల్ 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పెద్ద బోదనం నుంచి రాంపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో లక్షలాది రూపాయలు వెచ్చించి చేపట్టిన వక్కిలేరు వంతెన పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. 24 ఏళ్ల గడిచిన పనులు నేటికి పూర్తి కాలేదు. గత టీడీపీ హయాంలో ఈ వంతెన పనులను రూ.20 లక్షలతో చేపట్టారు. ఆ నిధులతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి 75 శాతం పూర్తి చేసి నిధులు సరిపోలేదంటూ వదిలేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా పాలకులు, అధికారులు స్పందించి వంతెన పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


బనగానపల్లె బాలికల ఉన్నత పాఠశాలలో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్

బనగానపల్లె, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. పట్టణంలోని 4వ చౌకదుకాణాన్ని తనిఖీ చేసి సరుకు రిజిస్టర్లను తనిఖీ చేసి డీలర్లతో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఎండీయూ వాహనాల వల్ల కలిగే ఇబ్బందులను గురించి డీలర్లు ఆయనకు వివరించారు. అలాగే పట్టణంలోని సివిల్ సప్లై గోడౌన్‌ను తనిఖీ చేశారు. రేషన్ స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించారు. గోదాములోని రేషన్ బస్తాలను పరిశీలించారు. అనంతరం యనకండ్ల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పిల్లలకు అందించే గుడ్లు, పౌష్టికాహారం గురించి ఆరా తీశారు. అనంతరం పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం, గుడ్ల సైజును స్వయంగా పరిశీలించారు. నందివర్గంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, మెనూను స్వయంగా పరిశీలించారు. ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దారు నారాయణరెడ్డి, సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దారు నారాయణరెడ్డి, ఎంఈవో స్వరూప, హెచ్ఎంలు బాలగంగాధర్‌రెడ్డి, హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మిరప పంట దగ్ధం


కాలిన మిరపను పరిశీలిస్తున్న టీడీపీ నాయకుడు భూమా సందీప్‌రెడ్డి

దొర్నిపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, నరసింహాలకు చెందిన 50 క్వింటాళ్ల మిరప పంట ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. దీంతో దాదాపు రూ.6 లక్షలు నష్టం వాటిల్లింది. అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, నరసింహాలు ఇరువురు కలిసి మూడున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని మిరప పంట సాగు చేశారు. పొలంలో మిరప కాయలను కుప్పగా పోసి పెట్టారు. రాత్రిళ్లు పశువులు, జంతువులు రాకుండా కాపాలా ఉంటూ చలిమంట వేసుకున్నారు. గురువారం తెల్లవారుజామున మంటను ఆర్పకుండా ఇంటికి వెళ్లారు. గాలి వీచడంతో పక్కనే ఉన్న పట్టలపై నిప్పులు పడి మంటలు వ్యాప్తి చెందాయి. పక్కనే ఉన్న మిరప కుప్పపై నిప్పులు పడటంతో దాదాపు 50 క్వింటాళ్ల మిరప కాయలు దగ్ధమయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి ఆళ్లగడ్డ అగ్నిమాపకదళ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మంటలను ఆర్పి వేశారు. చేతికొచ్చిన మిరప పంట కాలిపోవడంతో బాధిత కౌలు రైతులు కన్నీరుమున్నీరయ్యారు. కాలిపోయిన పంటను టీడీపీ నాయకులు భూమా సందిప్‌రెడ్డి, కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ఏరువ ప్రసాద్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి కాలిన పంటను పరిశీలించారు. ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందేలా చూస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తాం

- పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గుండయ్య

కోవెలకుంట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అందరి సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ గుద్దేటి గుండయ్య (చిన్న వెంకటసుబ్బారెడ్డి) అన్నారు. గురువారం గ్రామపెద్దలు, కమిటీ చైర్మన్, సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజ చేశారు. అనంతరం కమిటీ సభ్యులు లగ్నపత్రిక రాయించారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ చైర్మన్ మాట్లాడుతూ మే 7 నుంచి 17వరకు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గువ్వల సుబ్బారెడ్డి, కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, గడ్డం నాగేశ్వర్‌రెడ్డి, గడ్డం అమర్‌నాథరెడ్డి, లాయరు బాబు, రవీంద్రనాథరెడ్డి, సహదేవరెడ్డి, ఇతరసభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల ప్రయోజనాల కోసం పోరాటాలు చేస్తాం


ఆళ్లగడ్డ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ సభ్యులు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ఆర్టీసి కార్మికుల ప్రయోజనాల కోసం నిరంతరం పోరాటాలు చేస్తామని నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆళ్లగడ్డ డిపో ఎదుట యూనియన్ సభ్యులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. నాలుగు సంవత్సరాలుగా ఆగిపో యిన ప్రమోషన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియర్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'ఉద్యోగులపై పనిభారం తగ్గించాలి'

డోన్ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులపై పని భారం తగ్గించాలని డోన్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు సుదర్శన్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ గ్యారేజీ వద్ద ఆర్టీసీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు అధికారుల ఒత్తిడి వల్ల విధుల్లో అనారోగ్యాలకు గురవుతున్నారని, ఉద్యోగులకు ఆరు నెలలకు ఒకసారి మెడికల్ చెకప్‌తో పాటు 20 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు అక్క దేవతల విగ్రహ ప్రతిష్ఠ

దొర్నిపాడు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు కేసీ కెనాల్ కాలువ కట్ట సమీపంలో శుక్రవారం అక్కదేవతల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఉదయం యాగశాల ప్రవేశం, గణపతిపూజ, పుణ్యాహవచనం, ప్రధాన కలశస్థాపన, యంత్రాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠకు చుట్టుపక్కల గ్రామాల వారు తరలిరావాలని కోరారు. చేరివచ్చిన భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా గరుడ వాహన సేవ

అవుకు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీ కంబగిరిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో గురువారం గరుడవాహన సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కునుకుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గూడాల ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాముల వారిని పట్టువస్త్రాలతో, పూలమాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. గూడాల సోదరులు స్వాముల వారికి లక్ష్మీదేవి అమ్మవారి పూజలు చేసి గరుడవాహన సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారం భాస్కర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే జయంతిని జయప్రదం చేద్దాం

డోన్ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించనున్న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని విజయవంతం చేద్దామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏఈ నాగరాజు గౌడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10 గంటలకు పాఠశాలలో నిర్వహించనున్న పూలే జయంతి వేడుకలు పార్టీలకతీతంగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బాష్యం సోమన్నగౌడు, తదితరులున్నారు.

ప్రారంభోత్సవానికి తరలిరండి

డోన్ టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న కర్నూలు జిల్లాలో యూటీఎఫ్ భవన ప్రారంభోత్సవానికి తరలిరావాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్బరాయుడు తెలిపారు. గురువారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆహ్వానపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, యూటీఎఫ్ నాయకులు ఎన్ఎస్‌బాబు, నరసింహారెడ్డి, రమేష్ నాయుడు, అబ్దుల్ లతీఫ్, ప్రసాద్, చంద్రమోహన్, సంజీవరాయుడు, జగన్నాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి బాలరంగారెడ్డి అంజనప్ప, సర్వజ్ఞమూర్తి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జమాల్‌వలి స్వామి ఉరుసు

సంజామల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరుసోముల గ్రామంలో వెలసిన జమాల్‌వలి, ఉశేన్‌వలిస్వామి వార్ల ఉరుసు గురువారం వైభవంగా నిర్వహించారు. కొలిమిగుండ్ల, సంజామల మండలాల నుంచి భారీగా భక్తులు స్వామి వద్దకు చేరుకొని ఫాతేహాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం స్వామివారి గంధం మహోత్సవాన్ని తిలకించి, భక్తులు అక్కడే ఉండి స్వామి వారి ఉరుసు మహోత్సవం సందర్భంగా ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి భోజనాలు చేసి వెళ్లారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు: సీఐ


మాట్లాడుతున్న సీఐ మద్దినేని రమేష్ బాబు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు మోటార్‌సైకిల్స్ ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యత తీసుకో వాలన్నారు. చిన్నారులకు బైకులు, కార్లు ఇచ్చి ప్రోత్సహించడం వలన మీ కుటుంబాలకు నష్టం కలిగిస్తుందన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలని సీఐ సూచించారు.

తిరునాంపల్లెలో ఎమ్మెల్యే పల్లె నిద్ర


తిరునాంపల్లెలో పల్లెనిద్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరునాం పల్లె గ్రామంలో బుధవారం రాత్రి టీడీపీ తలపెట్టిన పల్లె వెలుగు- స్వర్ణగ్రామం పథకంలో భాగంగా గ్రామాభివృద్ధిని ప్రోత్సహించేందుకు చేపట్టిన పల్లెనిద్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

12వ పీఆర్‌సీ కమిషన్ వెంటనే వేయాలి

డోన్ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్‌సీ కమిషన్ వెంటనే వేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం డోన్ పట్టణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిషన్ రిపోర్టు ఇచ్చేలోపు 30 ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు నాగేంద్రప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్లు కృష్ణకుమార్, వైస్ ప్రెసిడెంటు శంషాద్‌బేగం పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ బీసీ సెల్ నాయకులు

డోన్ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఏపీ రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను డోన్ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఉడుములపాడులో 'పల్లెకు పోదాం'

డోన్ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ చేపట్టిన పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొంకూరు రవికుమార్ గురువారం ఉడుములపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులు మనోజ్ నాయుడు ఉన్నారు.

బేతంచెర్ల: పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా బేతంచెర్ల అర్బన్‌లో భాగమైన బుగ్గానిపల్లెలో అంగన్‌వాడీ మండల పరిషత్ ఉన్నత పాఠశాల, ఆసుపత్రిని బీజేపీ నాయకులు గురువారం సందర్శించారు. నాయకులు నాగ మోహన్ రెడ్డి, శ్రీకంటి మధు, బుగ్గానిపల్లె పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రవిశంకర్ నాయుడు, బీజేపీ నాయకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరుపుతున్నాం

●డోన్ ఫారెస్టు రేంజర్ ప్రవీణ్ కుమార్

డోన్ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): డోన్ ఫారెస్టు రేంజ్ పరిధిలో పని చేస్తున్న మహిళా బీట్ ఆఫీసర్లలో ఒకరిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు డోన్ ఫారెస్టు రేంజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ సమగ్ర విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. తదుపరి చర్యలు పైఅధికారులు నివేదికను బట్టి ఉంటాయని ఆయన వెల్లడించారు.

విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఏఎస్‌వో దస్తగిరి రెడ్డి అన్నారు. గురువారం చాగలమర్రిలోని కస్తూర్బా పాఠశాలలో ఏర్పాటు చేసిన పాల ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 27 కస్తూర్బా పాఠశాలలకు పాల ల్యాబ్‌లు, ట్యాప్‌లు మంజూరు చేశామని తెలిపారు. 20 మోడల్ పాఠశాలలు, 20 ట్రైబల్ పాఠశాలలకు కూడా విద్యార్థులకు ట్యాప్‌లు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో 66 పాఠశాలలకు ఈ ట్యాబ్‌లు పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం ఎమ్మార్సీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. వార్షిక ప్రణాళికను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో న్యామతుల్ల, ఎస్‌వో సునిత, సీఆర్పీలు అమీర్‌ఖాన్, ఖాసీం పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా పల్లకి ఉత్సవం


సాయిబాబా పల్లకితో ఊరేగింపు

చాగలమర్రి, ఏప్రిల్ 10 (ఆంధ్ర జ్యోతి): చాగలమర్రి గ్రామంలో సాయి బాబా పల్లకితో గురువారం వైభవంగా గ్రామోత్సవం చేశారు. ఆలయంలో సాయి బాబాకు జల, పాలాభిషేకాలు, ప్రత్యేక హార తులు ఇచ్చారు. మహిళలు సామూహికంగా సాయి వ్రతం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని చందలూరు, రుద్రవరం గ్రామాల్లో గురువారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. చందలూరు గ్రామంలో సాయినాథుడి విగ్రహానికి అభిషేకం చేశారు. రుద్రవరంలో సాయినాథుడి చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించారు. తరలివచ్చిన భక్తులు సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉండటంతో వడదెబ్బ తగలకుండా తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ సోకిన వ్యక్తికి వైద్య చికిత్స తప్పనిసరిగా అందించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు.

పరిశుభ్రతను పాటించాలి


చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న కార్యదర్శి, నాయకులు

ప్యాపిలి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రజలు పరిశుభ్రతను పాటించాలని పంచాయతీ కార్యదర్శి ఫ్రాన్సిస్ అన్నారు. గురువారం మండలంలోని రాచెర్ల గ్రామ సచివాలయంలో చెత్త బుట్టలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తను రోడ్డుపై వేయరాదన్నారు. బుట్టల్లో ఉంచితే పంచాయతీ సిబ్బంది తీసుకెళ్లతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుల క్రిష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ఏ కుటుంబానికి ఆర్థిక సాయం

బేతంచెర్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్. కొత్తపల్లి గ్రామానికి చెందిన వీఆర్ఏ చిన్నన్న (55) కుటుంబానికి ఆర్థిక సాయాన్ని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్, ఆర్ఐ హేమంత్ కుమార్ రెడ్డి గురువారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.